జర్నలిస్టులు.. పీడిత ప్రజల గొంతుకలు..

- టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర రెండో మహాసభలో మంత్రి శ్రీనివాసగౌడ్
- భవిష్యత్తు మరింత ప్రమాదకరం : తమ్మినేని
- పాత్రికేయులు తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలి : ఆంధ్రజ్యోతి సంపాదకులు శ్రీనివాస్
- సుందరయ్య పార్కు నుంచి ఆర్‌టిసి కళాభవన్ వరకూ ర్యాలీ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టులు... సమాజంలోని పీడిత ప్రజల తరపున నినదించే గొంతుకలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి వి శ్రీనివాసగౌడ్ వ్యాఖ్యానించారు. జీవితంలో ఒక్కసారి పెన్ను పట్టిన పాత్రికేయుడు... ప్రాణం పోయేదాకా దాన్ని వదలబోడని ఆయన తెలిపారు. దేశం అత్యంత సంక్లిష్ట, సంక్షుభిత పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో... మీడియా ప్రతిపక్ష పాత్రను పోషించాల్సిన అవసముందని ఆయన నొక్కి చెప్పారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య (టిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర రెండో మహాసభను ఆదివారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలోగల ఆర్‌టిసి కళాభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సుందరయ్య పార్కు నుంచి కళాభవన్ వరకు పాత్రికేయులు భారీ ప్రదర్శన నిర్వహించారు. 'వర్థిల్లాలి జర్నలిస్టుల ఐక్యత, పరిష్కరించాలి.. జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి.. జిందాబాద్ టిడబ్ల్యుజెఎఫ్, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలనివ్వాలి...' తదితర నినాదాలతో ర్యాలీని వారు హోరెత్తించారు. ప్రదర్శన కళాభవన్‌కు చేరుకున్న అనంతరం టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ఫెడరేషన్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సోమయ్య అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ సభలో శ్రీనివాసగౌడ్ ముఖ్య వక్తగా మాట్లాడుతూ... జర్నలిస్టు అనేవాడు ఒక వ్యక్తి కాదనీ, అతడు ఒక సమూహ శక్తి అని తెలిపారు. తెలంగాణ ఉద్యమాన్ని విశ్వవ్యాప్తం చేయటంలో పాత్రికేయులు క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. సమాజాన్ని మార్చేందుకు, ప్రజలకు సేవలకు చేసేందుకోసమంటూ అనేక మంది జర్నలిజాన్నే తమ కేరీర్‌గా ఎంచుకుంటున్నారని వివరించారు. అయితే ఆ విధంగా ఎంచుకుని ఈ వృత్తిలోకి వస్తున్న స్థానిక, మండల, జిల్లా విలేకర్లు, కేంద్ర కార్యాలయాల్లో పనిచేసే సీనియర్ జర్నలిస్టుల జీవితాలు, వారి జీవన ప్రమాణాలు చాలా దారుణంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారి పరిస్థితి... 'ఊపర్ శేర్వాణీ.. అందర్ పరేషానీ...' అన్నట్టుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో కడివెడు పాలల్లో ఒక్క బొట్టు విషం చుక్క పడ్డట్టు కొంత మంది బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఎల్లో జర్నలిజం వల్ల సమాజానికి మంచి జరక్కపోగా.. కీడు జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి రుగ్మతల నుంచి జర్నలిస్టులు, మీడియా రంగం బయటపడాలని ఆయన ఆకాంక్షించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ... నిజాం నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా పోరాడి బలైన ఆనాటి జర్నలిస్టు షోయబుల్లాఖాన్ వారసులుగా సమస్యలపై పోరాడాలని పాత్రికేయులకు పిలుపునిచ్చారు. వార్తను రాయటం, వక్రీకరించటంతోపాటు వార్తలు, కథనాలను ఉత్పత్తి చేయటం ఇప్పుడు రివాజుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకప్పుడు విషయం చుట్టూ మీడియా తిరిగేది.. ఇప్పుడు మీడియా చుట్టూ విషయం తిరుగుతుండటం శోచనీయమన్నారు. కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో పత్రికలు, ఛానెళ్లు నడుస్తున్న నేటి తరుణంలో భవిష్యత్తులో జర్నలిస్టుల పరిస్థితి ఇప్పుడున్న దానికంటే మరింత ప్రమాదకరంగా మారే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్బంధం, అణచివేత పెరగనుందని వివరించారు. ఈ క్రమంలో జర్నలిస్టులు మరింత సంఘటితమై తమ హక్కుల సాధన కోసం ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. వారికి సిపిఎం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ప్రజలే కేంద్రంగా, వారి జీవితాలే కథాంశాలుగా వార్తలు రాయాలని సూచించారు. ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక మాధ్యమాల విస్తరించిన నేపథ్యంలో నేటి జర్నలిస్టులు తమ వృత్తి నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. లేదంటే వారి మనుగడే ప్రశ్నార్థకమవుతుందని తెలిపారు.కోవిడ్ అనంతరం డిజిటల్ మీడియా శరవేగంగా దూసుకుపోతున్న తరుణంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలు ప్రజలపై ప్రభావం చూపలేకపోతున్నాయని వివరించారు. కాలక్రమంలో అవి అంతర్థానమై పోయినా ఆశ్చర్యపోనక్కర్లేదని వ్యాఖ్యానించారు. అందువల్ల జర్నలిస్టులు తమ హక్కుల సాధనతోపాటు డిజిటల్ మీడియాకు సరిపడా నైపుణ్యాలను, సామర్థ్యాలను అందిపుచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు వి హన్మంతరావు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులు, ఎన్ఎఫ్‌డబ్ల్యుజె నేత శాంతకుమారి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మెన్ తిరుమలగిరి సురేందర్ తదితరులు పాల్గొన్నారు. టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య కార్యకలాపాలపై నివేదిక (కార్యదర్శి నివేదిక)నిచ్చారు. ఇటీవల మరణించిన పలువురు జర్నలిస్టులు, ఇతర రంగాల ప్రముఖులకు సంతాపం తెలుపుతూ మధుకర్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వివిధ పత్రికల్లోని పలువురు జర్నలిస్టులను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జాతీయ నాయకులు పి ఆనందం, రాష్ట్ర నాయకులు పిల్లి రాంచందర్, ఆర్ వెంకటేశ్వర్లు, ఇ నర్సింగరావు, ఎస్‌కే సలీమా, హెచ్‌యుజె అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్‌కుమార్, బి జగదీశ్వర్ పాల్గొన్నారు.

శంషాబాద్ వరకూ 'మెట్రో' విస్తరణ : మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో మెట్రో సెకండ్ ఫేజ్ పనులకు సిఎం కెసిఆర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మెట్రో రైలు విస్తరణ చేపట్టనున్నట్టు ఆదివారం మంత్రి కెటిఆర్ ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. మైండ్ స్పేస్ జంక్షన్ వద్దగల రాయదుర్గం మెట్రో టర్మినల్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఈ మెట్రో కారిడార్‌ను విస్తరించనున్నారు. మొత్తం 31 కిలో మీటర్ల పొడవుతో కూడిన ఈ మెట్రో ప్రాజెక్టు నిర్మాణానికి సుమారు రూ.6,250 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయనున్నది. వచ్చే మూడేండ్లలో మెట్రో ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సర్కారు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు డిసెంబర్ 9న సిఎం కెసిఆర్ శంకుస్థాపన చేయనున్నట్టు కెటిఆర్ వెల్లడించారు. ఈ ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ మెట్రో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తుందని తెలిపారు. ఈ మెట్రో.. వయా, బయో డైవర్సిటీ జంక్షన్ కాజాగూడ రోడ్డు నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వద్దగల నానక్‌రామ్ గూడ జంక్షన్‌ను తాకుతూ వెళ్లనుంది. విమానాశ్రయం నుంచి ప్రత్యేక మార్గం ద్వారా(రైట్ ఆఫ్ వే) మెట్రో రైలు నడుస్తుంది. ఈ మార్గం వెంట పలు అంతర్జాతీయ సంస్థలు తమ కార్యాలయాలను నిర్మించుకుంటుండటంతో భవిష్యత్తులో నగర రూపురేఖలే మారనున్నాయి.

రాజ్యాంగాన్ని తిరగరాసే పనిలో బిజెపి

- డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రపంచంలోనే అత్యంత గొప్పగా పేర్కొనబడిన భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందనీ, దాన్ని తిరగరాసే పనిలో బిజెపి ఉందని బిఎస్‌పి అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఫోరం ఫర్ కానిస్టిట్యూషనల్ రైట్స్ ఆధ్వర్యంలో 'రాజ్యాంగం, ఎన్నికలు' అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బిజెపి పాలనలో రాజ్యాంగబద్ధమైన సంస్థలు ప్రమాదంలో పడ్డాయని అన్నారు. న్యాయవ్యవస్థలో కూడా ప్రభుత్వం జోక్యం చేసుకోవడం అత్యంత దారుణమని వ్యాఖ్యానించారు. ప్రధాన ఎన్నికల అధికారి నియామకంపై కూడా అవినీతి జరగడం చూస్తుంటే రాజ్యాంగం ఎంత ప్రమాదంలో ఉందో అర్థమవుతుందని తెలిపారు. మరోపక్క దేశంలో మరో రాజ్యాంగం రాసే పనిలో బిజెపి బిజీగా ఉందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో జస్టిస్ చంద్రకుమార్, కెప్టెన్ లింగాల పాండురంగారెడ్డి, రహమాన్ గౌర్, అడ్వకేట్ శైలజ, ముస్తాఫ్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

మిక్సోపతితో ప్రజారోగ్యానికి ఉపయోగం లేదు : ఐఎంఎ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మిక్సోపతితో ప్రజారోగ్యానికి ఉపయోగంలేదని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) రాష్ట్ర శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు ఐఎంఎ రాష్ట్ర అధ్యక్ష, గౌరవ కార్యదర్శులు డాక్టర్ బి.ఎన్.రావు, డాక్టర్ జె.విజయ్ రావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పి) అమలు పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిక్సోపతిని ప్రోత్సహించే విధానాలు తీసుకురావడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఐఎంఎ డాక్టర్లతో సమావేశం నిర్వహించిందనీ, అదే విధంగా జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులతోనూ చర్చించిందని తెలిపారు. ప్రజారోగ్యాన్ని ప్రమాదంలో పడేసే ఇలాంటి ఆరోగ్య విధానాలు మిక్సోపతి, బ్రిడ్జి కోర్సులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులైన అర్హులైన డాక్టర్ల సేవలను వినియోగించుకోవాలని కోరారు. అల్లోపతి డాక్టర్లకు ఎక్కువ మొత్తంలో జీతం ఆఫీర్ చేయాలనీ, కనీస జీతం నెలకు రూ.ఒక లక్షగా నిర్ణయించాలని సూచించారు.

సృజనాత్మకతతోనే గుణాత్మక ప్రగతి

- అధికారులు వినూత్న ఆలోచనలతో ముందుకెళ్లాలి
- నిజామాబాద్ పట్టణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దండి
- మున్సిపల్ శాఖ అభివృద్ధి పనులపై సమీక్షలో సిఎం కెసిఆర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ అధికారులు ఏరోజుకారోజు సృజనాత్మకంగా ఆలోచించి పనిచేస్తేనే గుణాత్మక మార్పు సాధ్యమవుతుందనీ, ప్రజలకు మరింత చేరువవుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం సమిష్టితత్వంతో సమన్వయంతో పనిచేయడం ద్వారా సాధించే ఫలితాలు సామాజికాభివృద్ధిని వేగవంతం చేస్తాయన్నారు. స్వరాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఫలితాలు రాబట్టండంలో ప్రభుత్వ ఉద్యోగుల సమిష్టి కృషి ఇమిడి ఉందని కొనియాడారు. ప్రతి పనినీ ఎంత శాస్త్రీయ ఆలోచనతో చేస్తున్నామనేది ముఖ్యమని చెప్పారు. మూస ధోరణులు, సంప్రదాయ పద్ధతుల్లో కాకుండా వినూత్న ఆలోచనలతో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే మార్గాలను అన్వేషించాలని ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో మున్సిపల్ శాఖ చేపట్టిన అభివృద్ధి పనులు, నిజామాబాద్ నగరంలో మౌలిక వసతులను మరింత మెరుగుపరచడం, సుందరంగా తీర్చిదిద్దడం వంటి అంశాలపై సిఎం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెసిఆర్ మాట్లాడుతూ.. ఉమ్మడి పాలనలో కనీస వసతులు లేని సందర్భాల్లోంచి నేడు అన్ని రంగాల్లో గుణాత్మకాభివృద్ధిని తెలంగాణ సాధించిందన్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విద్యుత్, రోడ్లు, విద్య, వైద్యం తదితర మౌలిక రంగాల్లో నాణ్యమైన వసతులు ప్రజల అనుభవంలోకి వచ్చాయన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ గుణాత్మక ప్రగతిని సాధించిందనీ, ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగిందని చెప్పారు. పౌర సౌకర్యాల పెంపుకోసం రోజు రోజుకూ డిమాండు పెరుగుతుందనీ, రాష్ట్ర ప్రభుత్వం మీద ప్రజలకు పెరిగిన విశ్వాసమే అందుకు కారణమని సీఎం అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిరంతర శ్రమతో నిలబెట్టుకోవాలిన అవసరమున్నదన్నారు. గతంలో ప్రజాదరణకు నోచుకోని ప్రభుత్వ దవాఖానాలు, తదితర ప్రభుత్వ వ్యవస్థలు నేడు అత్యంత ప్రజాదరణతో రద్దీగా ఉంటున్నాయన్నారు. దాదాపు 30 లక్షల మంది పక్క రాష్ట్రాలనుంచి తెలంగాణకు వలసవచ్చి బతుకుతున్న పరిస్థితి నెలకొందన్నారు. వర్షాల నేపథ్యంలో ఏటా ఆరేడు నెలలకాలంలోనే అభివృద్ధి పనులను పూర్తిచేసుకోవాల్సి ఉందన్నారు.

నిజామాబాద్ పట్టణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాలె: కెసిఆర్

ప్రగతి పథంలో దూసుకుపోతున్న నిజామాబాద్ నగరంలో అభివద్ధి మరింత ద్విగుణీకృతమై కండ్లకు కట్టాలని సిఎం కెసిఆర్ నొక్కి చెప్పారు. రెండున్నర నెల్లల్లో ప్రణాళికాబద్ధంగా పనులను పూర్తి చేయాలనీ, తాను పర్యటించి పనులను పరిశీలిస్తానని తెలిపారు. పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, మున్సిపల్ శాఖ, తదితర అన్ని శాఖలు సమన్వయంతో నిజామాబాద్ అభివృద్ధి పనులను పూర్తి చేసేలా పనుల్లో నిమగ్నం కావాలని స్థానిక ఎమ్మెల్యే గణేశ్ బిగాలకు సూచించారు. ఇప్పటికే విడుదలైన నిధులతో పాటు నిజామాబాద్ నగరాభివృద్ధికి అవసరమైన మరిన్ని నిధులను విడుదల చేయాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. ఖమ్మంలో జరిగిన అభివృద్ధి పరిశీలించి రావాలని అధికారులను ఆదేశించారు. నిజామాబాద్‌లోని దోబీఘాట్లు, సెలూన్లను అంచనావేసి మోడ్రన్ దోబీఘాట్లను నిర్మించాలన్నారు. నిజామాబాద్ నగరంలో గార్డెన్ల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చిన్నతనంలో తాను తరుచూ వెళ్లి కూర్చున్న తిలక్ పార్కును గుర్తుకు చేసుకున్నారు. ఆ గార్డెన్‌ను పునరుద్ధరించాలని ఆదేశించారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్ ను సుందరీకరించాలన్నారు. ఆ నగరంలోని ప్రభుత్వ భూములను గుర్తించాలనీ, ప్రజల అవసరాలకు ఉపయోగించేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. పాత ప్రభుత్వ కార్యాలయాలను ఎలా వాడుకోవాలనే దానిపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలో మున్సిపల్ శాఖ చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి కేటీఆర్ వివరించారు. నిజామాబాద్‌లో ఆడిటోరియం నిర్మాణానికి సంబంధించిన వివరాలను మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. నగరాభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్సీ కవిత సీఎంను అభ్యర్థించారు. బస్టాండ్, క్రీడాప్రాంగణం గురించి వివరించారు. హజ్ భవన్ నిర్మాణం చేపట్టాలని సీఎం కోరారు. ఈ సమీక్షలో మున్సిపల్ శాఖ ఉన్నత, జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

నేడు దామరచర్లకు సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా దామరచర్లలో నిర్మితమవుతున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనుల పురోగతి పర్యవేక్షణ కోసం సిఎం కెసిఆర్ సోమవారం దామరచర్లకు బయలుదేరి వెళ్లనున్నారు. ఉదయం 11 గంటలకు ప్రగతి భవన్ నుండి బయలు దేరుతారు. బేగంపేట విమానాశ్రయం నుంచి వాయుమార్గం ద్వారా ప్రయాణించి మధ్యాహ్నం 12 గంటలకు కల్లా దామరచర్ల చేరుకుంటారు. అక్కడ జరుగుతున్న థర్మల్ పవర్ ప్లాంట్ పనుల పురోగతిని విద్యుత్ శాఖ మంత్రి మంత్రి జగదీశ్‌రెడ్డి, ఆ శాఖ ఉన్నతాధికారులతో కలిసి పరిశీలిస్తారు. అనంతరం సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు.

ప్రయివేటు ఆస్పత్రుల్లో సి సెక్షన్ల తగ్గించాలి

- మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రయివేటు ఆస్పత్రుల్లో సి సెక్షన్లను తగ్గించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు తెలిపారు. ఆదివారం హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహించిన మిసెస్ మామ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో 44 శాతం, ప్రయివేటు ఆస్పత్రుల్లో 77 శాతం జరుగుతున్నాయని తెలిపారు. సి సెక్షన్లు తగ్గించేందుకు డాక్టర్ శిల్పారెడ్డి చేస్తున్న కృషిని ప్రశంసించారు. అనవసర సిజేరియన్లతో భవిష్యత్తులో తల్లికి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముందని హెచ్చరించారు.

ఎన్ఇపితో అసమానతలు

- ప్రభుత్వ విధానంతో విద్యారంగం కార్పొరేట్ పరం
- ఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభల పోస్టర్ అవిష్కరణలో చుక్కా రామయ్య



మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చుక్కా రామయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేసేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభ పోస్టర్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజుతో కలిసి ఆయన అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యావిధానంతో ఆ రంగంలో తీవ్ర అసమానతలు పెరిగే అవకాశముందన్నారు. దేశ భవిష్యత్‌ను నిర్దేశించేది విద్యార్థులేనని చెప్పారు. వారిని సరైన మార్గంలో నడిపించటమంటే.. సమాజం పట్ల వాస్తవిక దృక్పధాన్ని అందించటమేనని తెలిపారు.. ఆర్ఎల్ మూర్తి, నాగరాజు మాట్లాడుతూ డిసెంబర్ 13 నుంచి 16 వరకు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జాతీయ 17 వ మహాసభలు జరగనున్నాయని తెలిపారు. దేశ వ్యాప్త విద్యార్థి ఉద్యమాలకు ఈ సభల్లో రూపకల్పన చేయనున్నట్టు తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గత ఎనిమిదేండ్లలో విద్య, ఉపాధి రంగాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. యూనివర్శిటీలకు తగిన నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. భారీగా ఫీజులు పెంచి పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నదని చెప్పారు.

విద్యారంగంలో కాషాయికరణ, వ్యాపారీకరణ, కార్పోరేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. నూతన విద్యావిధానం పేరుతో ఆరెస్సెస్ భావాజాలన్ని విద్యలో ప్రవేశపెట్టి సిలబస్ మార్చివేసి, చరిత్రను వక్రీకరిస్తుందని చెప్పారు. ఉన్నత స్థాయి విద్యాసంస్థల్లో ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయకుండా ఉండడం ద్వారా అణాగారిన వర్గాలకు ఈ విద్యాసంస్థల్లో స్థానం లేకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరెస్సెస్‌కు చెందిన వ్యక్తులను యూజీసీ చైర్మెన్‌గా నియమించి యూనివర్శిటీల్లో ప్రజాస్వామిక వాతవరణాన్ని లేకుండా చేస్తున్నదని విమర్శించారు. 29 రాష్ట్రాల నుంచి 1500 మందికి పైగా ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రజినీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ నృత్య ప్రక్రియల సమాహారం నృత్యోత్సవ్

ప్రజాశక్తి - కల్చరల్

దేశంలోని భిన్న ప్రాంతాలకు చెందిన సంప్రదాయ నృత్య ప్రక్రియల సమాహారంగా శ్రీత్యాగరాయ గాన సభ వేదిక నిలిచింది. భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సంచలన స్కూల్ ఆఫ్ డాన్స్ నిర్వహణలో రెండు రోజుల నృత్యోత్సవ్‌లో ఆదివారం మహారాష్ట్రకు చెందిన పద్మశ్రీ దర్శన జవేరి మణిపురి నాట్య ప్రక్రియలో నవ రసాలను ప్రదర్శించారు. న్యూ ఢిల్లీకి చెందిన హుస్సైన్ స్థాపించిన వియ్ అర్ వన్ వికాలాంగ కళాకారులు తమ కుర్చీలలో కూర్చునే అద్భుత నాట్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యంలో ముంచారు. హాంగ్ కాంగ్ నుంచి వచ్చిన రూప కిరణ్ భరత నాట్యం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీకాంత్ కూచిపూడి నాట్యం ప్రదర్శించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో కళాకారులకు గోల్కొండ జీవిత సాఫల్య పురస్కారాలు, డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, పసుమర్థి శేషుబాబు, పద్మ కళ్యాణ్, విక్రమ్, కిరణ్మయిలు బహూకరించారు.

సింధు, బిందు నర్తనం ముగ్ధ మనోహరం

ప్రజాశక్తి - కల్చరల్

తక్కువేమి మనకు రామదాసు కీర్తనలోని ఆర్తిని, భక్తిని రస భరితంగా సౌరాష్ట్ర రాగ అనుగుణంగా సోదరీమణులు సింధు, బిందులు ముగ్ధమనోహరంగా నర్తించి వీక్షకుల ప్రశంసలందుకున్నారు. ప్రముఖ కూచిపూడి నాట్య గురువు దీపికా రెడ్డి శిష్యురాళ్లు సింధు, బిందుల కూచిపూడి నాట్య రంగ ప్రవేశం దీపాంజలి నాట్య సంస్థ నిర్వహణలో ఆదివారం జరిగింది. తొలి అంశంగా శంకరాచార్య గణపతి స్తుతితో నర్తనాన్ని ఆరంభించిన బిందు, సింధు ద్వయం నారాయణ తీర్థ విరచిత శివ శివ భవ భవ శరణం అంశంలో హావభావాలలో నర్తించారు. గురువు దీపికారెడ్డి నట్టువాంగం చేయగా డి.ఎస్.వీ.శాస్త్రి గానం నాట్యానికి వన్నె తెచ్చింది. వాయులీనంపై సాయి కుమార్, మృదంగంపై రాజగోపాలా చార్య, వేణువుపై మురళి సహకరించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో అతిథులుగా సినీ దర్శకుడు సుకుమార్, సంగీత దర్శకుడు దేవీ ప్రసాద్, విశ్రాంత సి.బి.ఐ అధికారి లక్ష్మీ నారాయణ, సినీ రచయిత విజయేంద్రప్రసాద్ తదితరులు పాల్గొని బిందు, సింధులు భవిష్యత్తు ఉన్న కళాకారులని కొనియాడారు.



నారాయణమ్మ కాలేజీలో జాతీయ ఇంటర్ కాలేజ్ స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నారాయణమ్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రెండు రోజులపాటు జరిగిన జాతీయ ఇంటర్ కాలేజ్ స్పోర్ట్స్ మీట్ ముగిసింది. బహుమతుల ప్రధానోత్సవ కార్యాక్రమానికి అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైశ్వాల్ హాజరయ్యారు. క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆమె బహుమతులు అందజేశారు.

టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం.సోమయ్య, బి.బసవపున్నయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో




తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం హైదరా బాద్‌లో ఫెడరేషన్ ద్వితీయ రాష్ట్ర మహాసభ జరిగింది. రాష్ట్ర అధ్యక్షులుగా మామిడి సోమయ్య, బి.బసవపున్న య్యను మహాసభ ఎన్నుకున్నది. 27 మంది ఆఫీస్‌బేరర్లు, 53 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. మహాసభ కార్యవర్గాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరుమలగిరి సురేందర్, బీఆర్‌కే మూర్తి ప్రకటించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దేవరాజు మహారాజు, తదితరులు

ఘనంగా పిల్లల పండుగ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్‌వికె) అధ్వర్యంలో 'సాంస్కృతిక ఉత్సవం–పిల్లల పండుగ'ను ఆదివారం ఉత్తేజంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30 హైస్కూళ్ల విద్యార్థులు పాల్గొన్నారు. చిత్ర లేఖనం, వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించారు. అలాగే దేశభక్తి గీతాలు, జానపద నృత్యాలు, ఆట, పాటలతో పిల్లలు సందడి చేశారు. ఈ సందర్భంగా హాజరైన కొత్తగూడెం బాలోత్సవం వ్యవస్థాపకులు డా॥ రమేష్‌బాబు మాట్లాడుతూ.. పిల్లల్లో సామాజిక చైతన్యం పెరగడానికి పిల్లల పండగలు ప్రతి జిల్లాలో జరపాలని, ఇలాంటి కార్యక్రమాలకు తాము తోడుగా ఉంటామని తెలిపారు. ఎస్‌వికె కార్యదర్శి ఎస్ వినయకుమార్ మాట్లాడుతూ.. రేపటి పౌరుల ఉత్సాహ, విజ్ఞాన వేదిక పిల్లల పండగ అని అన్నారు. చదువులు, ర్యాంకులు, పరుగులు, వీడియో గేములు, కంప్యూటర్లు ఇవి మాత్రమే కావని, కూసింత శాస్త్రీయ ఆలోచనను రేకెత్తించే వారి ప్రతిభా పాటవాలను అవలీలగా ప్రదర్శించే వేదికలను ప్రోత్సహించాలని సూచించారు. ఇలాంటి పిల్లల పండగ నిరంతరం యజ్ఞంలా నిర్వహిస్తామని చెప్పారు. విజ్ఞాన శాస్త్రవేత్త, ప్రముఖ రచయిత దేవరాజు మహారాజు మాట్లాడుతూ.... ఇది బాలోత్సవం కాదు, పిల్లల సృజనోత్సవం అన్నారు. విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు టి రమేష్ విజ్ఞాన వైజ్ఞానిక సైన్స్ ప్రదర్శన నిర్వహించి మూఢ విశ్వాసాల గురించి చెప్పారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు జి బుచ్చిరెడ్డి అందరికీ స్వాగతం పలికారు.

పిల్లల పండుగ నిర్వహణ కమిటీ ఎన్ సోమన్న, తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం నాయకులు భూపతి వెంకటేశ్వర్లు సమన్వయం చేశారు. కార్యక్రమంలో వాసిరెడ్డి రమేష్ బాబు రచించిన 'నది లాంటి మనిషి' పుస్తకాన్ని దేవరాజు మహారాజు ఆవిష్కరించారు. విజేతలకు బహుమతులు సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేశారు.

సెక్రటేరియట్ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కొత్త సెక్రెటేరియట్ పనులను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆదివారం ఆకస్మికంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మూడు షిఫ్టుల్లో వర్కర్లను పెంచి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అధికారులకు, వర్క్ ఏజెన్సీకి పలు సూచనలు చేశారు. నిర్దేశించిన గడువులోగా నిర్మాణం పూర్తి కావాలని మంత్రి వారికి స్పష్టం చేశారు.

సరళతరమైన విధానాలతోనే వాణిజ్యానికి ఊతం

- ఆర్‌డిఐ ఉత్తరాఖండ్ ప్రధాన కమిషనర్ అనిల్ చంద్ర పునిత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు సరళతరమైన పారిశ్రామిక విధానాలతోనే వాణిజ్యానికి డిమాండ్ పెరుగుతుందని ఉత్తరాఖండ్ ఆర్టీఐ ప్రధాన కమిషనర్ అనిల్ చంద్ర పునిత్ అన్నారు. హైదరాబాద్‌లో డిజిటల్ రంగానికి చెందిన శ్రీను టెక్నాలజీ కంపెనీ మొదటి వార్షికోత్సవంలో ఆయనతో పాటు టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, అపోలో హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ అడ్వైజర్, గాంధీ ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ మోహన్ కృష్ణ, చార్టెట్ అకౌంటెంట్ సదాశివరెడ్డి, వ్యాపారవేత్త కె.ఇ.హరిబాబు, శ్రీను టెక్నాలజీ ఎండి చిల్కా కావ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ 2030లో భారతదేశం ప్రపంచంలోనే మూడవ ఆర్థిక దేశంగా, 2050లో రెండవ అతిపెద్ద ఆర్థిక దేశంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎఆర్ సుకుమార్ మాట్లాడుతూ భవిష్యత్తు టెక్నాలజీదేనన్నారు. ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ రాబోయే రోజులు ఎలక్ట్రానిక్స్ డివైస్ ద్వారా వచ్చే సమాచారంపైన ఆధారపడి ఉంటుందని తెలిపారు.

కెసిఆర్ నా వెంటున్నంత వరకు ఏ రైడ్స్‌కు భయపడ..

- ఉచిత వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం కెసిఆర్ నా వెంట ఉన్నంత వరకు ఎలాంటి రైడ్స్‌కు భయపడనని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ బహిలింపూర్‌లో మాజీ సర్పంచ్ నేర్లపల్లి కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, ఎఫ్‌డిసి చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదగిరి రెడ్డితో కలిసి మంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక దేశమంతా ఇన్‌కమ్‌ట్యాక్స్ రూల్స్ మారుస్తామన్నారు. దేశంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరూ ఎంతైనా సంపాదించుకోవచ్చన్నారు. సంపాదించుకున్న వాళ్లు వాళ్లంతట వాళ్లు ట్యాక్స్ చెల్లించుకునే విధంగా సిఎం కెసిఆర్ రూల్స్ తీసుకొస్తారని చెప్పారు. మొండివైఖరితో ధరలు పెంచి ప్రజలను ఇబ్బంది పెట్టే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వద్దన్నారు. కెసిఆర్ గొప్ప ఆలోచనపరుడని, బిఆర్ఎస్‌తోనే దేశం మొత్తం అభివృద్ధి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, ములుగు జెడ్‌పిటిసి జయమ్మ అర్జున్‌గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మీడియాదే ఎక్కువ బాధ్యత : విహెచ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మీడియాలో ముఖాలను చూసి కాకుండా వార్తాంశానికి ప్రాధానత్య ఇవ్వాలని మాజీ ఎంపి, కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు కోరారు. కొందరికేమో పేజీలో సగం ప్లేసు కేటాయిస్తూ నచ్చనోళ్ల విషయంలో సింగిల్ కాలమ్ వార్త కూడా రాయకపోవడం అన్యాయమన్నారు. సమాజాభివృద్ధిలో మీడియాదే ఎక్కువ బాధ్యత అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆర్‌టిసి కళాభవన్‌లో నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర రెండో మహాసభకు విహెచ్ హాజరై మాట్లాడారు. చిన్నచిన్న పత్రిల ద్వారా మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పారు. నేడు మీడియా యాజమాన్యాల వైఖరి పూర్తిగా మారిందన్నారు. మేనేజ్‌మెంట్లు కోటీశ్వర్లు అయితుంటే మరోవైపు నూటికి 80 శాతం జర్నలిస్టులు దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారని చెప్పారు. ఇదే సందర్భంలో జీతాల్లేక కొంత మంది జర్నలిస్టులు పెడదోవ పడుతున్నారనీ, దీనికి యాజమాన్యాలే కారణమని విమర్శించారు. ప్రభుత్వాలను నడిపించాల్సిన పత్రికలు..నేడు ప్రభుత్వాలు ఏది చెబితే అది చేస్తున్నాయని వాపోయారు.

కార్మికులు సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలి

- జన్మ హక్కును నిర్వీర్యం చేస్తే సమాధి చేస్తాం : పాలడుగు భాస్కర్
- గ్రామపంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర మహాసభ..



మహాసభలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నో దశాబ్దాలుగా కార్మికులు, కర్షకులు పోరాడి సాధించుకున్న హక్కులను నీరు గార్చేందుకు బిజెపి కుట్రలు చేస్తున్నదని, కార్మికులు సంఘటితమై సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర 4వ మహాసభల ప్రతినిధుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సిఐటియు నిర్వహించిన ప్రజా పోరాటాలపై ప్రపంచవ్యాప్తంగా చర్చ సాగాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల కార్మిక లోకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంపై దృష్టి సారించకపోవడం వల్ల సంక్షేమం అదుపు తప్పి ప్రజల కొనుగోలు శక్తి పడిపోతుందని విమర్శించారు. కార్మికులు పనిచేసే ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. మహిళలకు ప్రత్యేక వసతులు కల్పించాలని చట్టంలో పేర్కొన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కి పాలకులు, కార్పొరేట్ శక్తులు, ప్రయివేటు యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నాయని తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటాల వల్లే యుపిఎ ప్రభుత్వ హయాంలో జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు. కార్మికుల పిల్లలకు మెరుగైన విద్యను అందించాలని పోరాటం చేస్తూ ఉంటే కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిర్బంధ విద్యను అమలు చేయకుండా నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు అత్యాచారాలు పెరిగిపోయాయని తెలిపారు. అన్ని వర్గాల ప్రజా సమస్యలపై భవిష్యత్‌లో సమరశీల పోరాటాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. మహాసభలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, మున్సిపల్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాయకులు ఆంజనేయులు, శ్రీనివాసులు, పర్వతాలు, కందికొండ గీత, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

రాందేవ్‌బాబా క్షమాపణ చెప్పాలి

- రాష్ట్ర వ్యాప్త నిరసనలకు ఐద్వా పిలుపు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యోగా గురువు రాందేవ్ బాబా చేసిన వ్యాఖ్యలు అర్థరహితమనీ, ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అర్ అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహిళల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యానించిన రాందేవ్‌బాబాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపట్టాలని ఐద్వా శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇటీవల కాలంలో కొందరు మహిలపై అనుచిత వ్యాఖ్యానాలు చేయడం పరిపాటిగా మారుతున్నదని తెలిపారు. రాజ్యాంగం స్త్రీపురుషులకు సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించిందనీ, నచ్చిన పద్ధతిలో జీవించే హక్కును ప్రసాదించిందని తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తికే భిన్నంగా మనువాద విధానాన్ని అమలు చేసేందుకు బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని పేర్కొన్నారు. మహిళలపట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

రేడియోగ్రాఫర్లకు మూడు నెలలకోసారి శిక్షణ : ఐఎస్ఆర్‌టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రేడియోగ్రాఫర్లకు మూడు నెలలకోసారి శిక్షణ ఇవ్వనున్నట్టు ఇండియన్ సొసైటీ ఆఫ్ రేడియోగ్రాఫర్స్ అండ్ టెక్నాలజిస్ట్స్ (ఐఎస్ఆర్‌టి) రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ గౌడ్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో రేడియోగ్రాఫర్స్ డే నిర్వహించారు. సీనియర్ రేడియాలజిస్ట్ డాక్టర్ జువ్వాడి సందీప్, రేడియోగ్రఫీలో వస్తున్న ఆధునాతన పరిజ్ఞానాన్ని వివరించారు. అనంతరం సొసైటీ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి టోనీ, కో ఆర్డినేటర్ అన్సారీలతో కలిసి మాట్లాడుతూ, రేడియోగ్రాఫర్లకు ఒక రోజు శిక్షణకు మంచి స్పందన వచ్చిందని తెలిపారు. రేడియోగ్రఫీలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. రోగికి చికిత్సనందించడంలో మొదటి అడుగు పరీక్షలనీ, ఆ పరీక్షలు నిర్వహించే వారు ఎంత పరిజ్ఞానం కలిగి ఉంటే చికిత్స అంత సులువవుతుందని తెలిపారు.

అవయవదానం చేసిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండ

అవసరమైతే హెలికాప్టర్ వినియోగిస్తాం : మంత్రి హరీశ్‌రావు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గాంధీ ఆస్పత్రిలో త్వరలోనే రూ. 35 కోట్లతో అవయవ మార్పిడి విభాగం ఏర్పాటు చేయబోతున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ప్రకటించారు. హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీలో ఆదివారం ఆర్గాన్ డొనేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి అవయవదానం చేసిన దాతలను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అవయవదానం ప్రోత్సహించడంలో భాగంగా అవయవదానం చేసిన పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అవయవదానం చేయడంలో దేశంలోనే తెలంగాణ ముందంజలో ఉందన్నారు. అవయవదానం కోసం అవసరమైతే హెలికాప్టర్ సైతం వినియోగిస్తామన్నారు. మనిషి మరణించిన తర్వాత విలువైన అవయవాలు మట్టిలో కలవడం కన్నా దానం చేయడం ఎంతో మిన్న అని తెలిపారు. రాష్ట్రం ఏర్పాటు తర్వాత చేస్తున్న ప్రచార కార్యక్రమాల వల్ల అవయవదానాల సంఖ్య క్రమంగా పెరుగుతోందన్నారు. 2015 నుంచి ఇప్పటి వరకు 1080 డొనేషన్లు జరిగాయని చెప్పారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లోనే కాదు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఖరీదైన ట్రాన్స్‌ప్లాంటేషన్లు జరుగుతున్నాయన్నారు. నిమ్స్‌లో 351, ఉస్మానియాలో 71, గాంధీలో 11 మొత్తం 433 ట్రాన్స్‌ప్లాంటేషన్లు జరిగాయని వివరించారు. ఇందులో అత్యధికంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు నిమ్స్‌లో జరిగాయని తెలిపారు. రూ. పది లక్షల విలువ చేసే ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలను పేదలకు ప్రభుత్వం ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా చేరువ చేసిందన్నారు. దాంతో పాటు సర్జరీ చేసుకున్న వారికి జీవిత కాలం పాటు రూ. పది వేలు విలువ చేసే ఇమ్యునోసప్రేషన్ మందులను ఉచితంగా అందిస్తున్నట్టు చెప్పారు. ఇక మొత్తం 36 ప్రభుత్వ ఆస్పత్రులు జీవన్ దాన్‌లో రిజిస్టర్ కాగా, నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్లు జరుగుతున్నాయన్నారు. 2013లో జీవన్‌దాన్ కార్యక్రమం ప్రారంభం కాగా, ఇప్పటి వరకు 1142 బ్రెయిన్ డెత్ డొనేషన్స్ జరిగాయని, మొత్తం 4316 ఆర్గాన్స్ సేకరించి, అవసరం ఉన్న వారికి అమర్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంఇ రమేష్ రెడ్డి, గాంధీ హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు పాల్గొన్నారు.

బోధనేతర సిబ్బంది సమస్యలపై ఉద్యమిద్దాం : వెంకటేశ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూనివర్సిటీల్లో బోధనేతర సిబ్బంది సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె.వెంకటేశ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ (టైమ్ స్కేల్, ఎన్ఎంఆర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, డైలీవేజ్ తదితర) సిబ్బంది సమస్యలను పరిష్కరించి పర్మినెంట్ చేయాలనీ, సమాన పనికి – సమాన వేతనం చెల్లించాలనీ, పనిభారం తగ్గించాలని కోరారు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి పోస్టాఫీసులో రాష్ట్ర సన్నాహక సమావేశం ఆదివారం జరిగింది. తమ న్యాయమైన సమస్యలను ప్రతిపాదించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాష్ట్ర కమిటీ తరపున మెమోరాండం ఇవ్వాలనీ, 2022 డిసెంబర్ చివరి వారంలో రాష్ట్ర మహాసభ జరపాలని తీర్మానించారు. రాష్ట్ర బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల సందర్భంలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి పద్మశ్రీ అధ్యక్షత వహించగా హైదరాబాద్ నుంచి జె.కుమారస్వామి, మహేందర్‌లు పాల్గొన్నారు. వివిధ యూనివర్సిటీల నుంచి ముఖ్యమైన నాయకులు మెట్టు రవి, సలార్, అమీద్, యాకుబ్, సతీష్, శ్రీను తదితరులు పాల్గొని ప్రసంగించారు.

భూమి ఇస్తేనే ఆలయ ప్రవేశం

- దళితుడి పట్టాభూమిపై కన్నేసిన అగ్రకుల పెద్దలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దళితుడి పట్టా భూమిపై కన్నేసిన అగ్రకుల పెద్దలు.. ఆ భూమిని ఉచితంగా ఇస్తేనే ఆ కుటుంబానికి ఆలయంలోకి ప్రవేశం కల్పిస్తామని కొర్రీ పెట్టింది. అందుకు దళిత రైతు ససేమిరా అనడంతో కుటుంబాన్ని గ్రామం నుంచి బహిష్కరిస్తూ హుకుం జారీ చేసిన ఘటన నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం మోతే గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు ఇసపల్లి రవి ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇసపల్లి రవి వృత్తిరీత్యా బ్యాంకు ఉద్యోగి. కాగా, శివాలయంలో మొక్కు తీర్చుకోవడానికి వచ్చిన రవిని.. గ్రామంలోని అగ్ర కులానికి చెందిన కొందరు వచ్చి.. అడ్డుకొని శివారులో ఉన్న సర్వే నెంబర్ 333లోని ఒకటిన్నర ఎకరాల పట్టా భూమిని ఉచితంగా ఇవ్వాలని, లేకపోతే ఆలయంలోకి ప్రవేశం లేదని అడ్డుకున్నారు. శివారులో గుట్టపై ఉన్న రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని విస్తరించేందుకు రవి భూమిపై గ్రామ పెద్దలు కన్నేశారు. దానికి రవి ససేమిరా అనడంతో అతని కుటుంబాన్ని బహిష్కరిస్తున్నట్టు హుకుం జారీ చేశారు. అగ్ర కులాల వారికి దళితులపై చిన్నచూపు ఉందని, ఆలయంలోకి ప్రవేశం కల్పించకుండా అడ్డుకుంటున్నారని బాధితుడు వాపోయాడు. నిందితులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని, మరే ఇతర దళితులకు ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

భారత రాజ్యాంగ ధ్వంసమే ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం

- దాన్నే అమలు చేస్తున్న ప్రధాని
- జుట్టుపై తప్ప అన్నింటిపై పన్ను వేసిన ఘనుడు మోడీ
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడమే ఆర్ఎస్ఎస్ సిద్ధాంతమని, ఆ సిద్ధాంతాన్నే ప్రధాని మోడీ పకడ్బందీగా అమలు చేస్తున్నారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు విమర్శించారు. ఆదివారం యాదాద్రి భువనగిరిజిల్లా మోత్కూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం పునరంకితం కావాలని, రాజ్యాంగ విలువలను కాపాడాలని, ప్రజలు తమ బాధ్యతలను, విధులను సక్రమంగా నిర్వహిస్తేనే ఈ దేశం బాగుపడుతుందని చెప్పిన మోడీ రాజ్యాంగ మౌలిక సూత్రాలైన నాలుగింటిని లౌకిక ప్రజాస్వామ్యం, ఆర్థిక స్వావలంబన, సామాజిక న్యాయం, ఫెడరలిజాన్ని తుంగలో తొక్కారని విమర్శించారు. లౌకిక ప్రజాస్వామ్యాన్ని తొంగలోకి నెట్టిన బిజెపి.. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని రంగం మీదకు తెచ్చి అమలు చేసేందుకు బిజెపి కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. గాంధీని చంపిన గాడ్సేను దేశ భక్తుడు అంటూ గాడ్సేకు గుడి కడుతున్నారని, ఇలాంటి విషయాలను ఎవరైనా అడిగితే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా జర్నలిస్టులను, అభ్యుదయ భావాలు కలిగిన మేధావులను ఇప్పటికే చాలా మందిని చంపేశారన్నారు. బ్రిటీష్ వాళ్లు ఉప్పుపై పన్ను వేస్తే గాంధీ ఉప్పు సత్యాగ్రహం చేసి దేశ ప్రజలందరినీ ఏకం చేసి ఉద్యమం చేశారని, కానీ ఇప్పుడు మోడీ జుట్టుపై తప్ప అన్నింటిపై జిఎస్‌టి వేసినా ఎవరూ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరిస్తున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ అవసరం, అధికారం కోసం ఉచిత పథకాలు అమలు చేస్తున్నాయని, పేదలకు ఉచిత పథకాలు ఎందుకని, వాటిని రద్దు చేయాలని మోడీ చెబుతున్నారన్నారు. పేదలకు అందే సబ్సిడీలు, రాష్ట్రంలో అమలవుతున్న రైతుబంధు, కల్యాణలక్ష్మి, పింఛన్లు రైతు బీమా, ఇళ్ల పథకాల వాటిని ఎత్తేయాలని కేంద్రం చెబుతున్నారన్నారు. రూ.12 లక్షల కోట్లను పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు మాఫీ చేసిన కేంద్రప్రభుత్వం పేదలపై మాత్రం గ్యాస్, డీజిల్, పెట్రోల్, ధరల భారం మోపి ఏడిపిస్తోందన్నారు. రాజ్యాంగ విలువలను వక్రీకరిస్తూ ధ్వంసం చేస్తున్న ప్రధాని మోడీ, బిజెపి అరాచకాలను అర్థం చేసుకుని రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జల్లెల పెంటయ్య, సహాయ కార్యదర్శి బొల్లు యాదగిరి, పల్లెర్ల అంజయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి దాసరి పండు, జిల్లా ఉపాధ్యక్షుడు కల్లూరి మల్లేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బుర్రు అనిల్ కుమార్ ఉన్నారు.

సింగపూర్ వేదికగా వరల్డ్ తెలంగాణ ఐటి కాన్ఫరెన్స్

- లోగో ఆవిష్కరించిన మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ టెక్నాలజీ నిపుణులందరినీ ఒక తాటిపైకి తెచ్చేందుకు సింగపూర్ వేదికగా వరల్డ్ తెలంగాణ ఐటి కాన్ఫరెన్స్ జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టిటా) ఆధ్వర్యంలో 2023 ఏప్రిల్ నెలలో సంయుక్తంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు వరల్డ్ తెలంగాణ ఐటి కాన్ఫరెన్స్ (డబ్ల్యూటిఐటిసి) లోగోను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ ఆదివారం టిహబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. సింగపూర్ వేదికగా ప్రపంచంలోని తెలంగాణ టెక్కీలు ఒకే వేదికపై రానున్న ఈ విశిష్ట సదస్సులో టెక్నాలజీ ఎక్సేంజ్, ఇన్నోవేషన్స్‌పై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. టిటా దశాబ్ది వార్షికోత్సవాల్లో భాగంగా వరల్డ్ తెలంగాణ ఐటి కాన్ఫరెన్స్ (డబ్ల్యూటిఐటిసి) నిర్వహణకు ముందుకొచ్చిన టీటా చొరవను ప్రశంసించిన మంత్రి కెటిఆర్ టిటా కార్యక్రమాలకు ప్రభుత్వ మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా ప్రకటించారు. టిటా దశాబ్ది వార్షికోత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న ఈ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన లోగోను ఆదివారం టీ హబ్‌లో తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ వరల్డ్ తెలంగాణ ఐటీ కాన్ఫరెన్స్ నిర్వహణ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయిలో టీటా ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చేయాలను కోరుకుంటున్నట్టు పేర్కొన్నారు. వరల్డ్ తెలంగాణ ఐటీ కాన్ఫరెన్స్ నిర్వహణ ద్వారా ఇన్వెస్ట్‌మెంట్ వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణకు ప్రయోజనం కలిగించే ఈ కాన్ఫరెన్స్‌లో తెలుగు టెకీలు పాల్గొనాలని పేర్కొన్నారు. టిటా గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్ మఖ్తల ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఐటీ నిపుణులు, ఆవిష్కర్తలు, పరిశోధకులతో సింగపూర్ కేంద్రంగా నిర్వహిస్తున్న వరల్డ్ తెలంగాణ ఐటి కాన్ఫరెన్స్‌కు తెలంగాణ ప్రభుత్వం మద్దతు తెలపడం సంతోషకరమని అన్నారు.


నల్లమలలో గుప్తనిధుల వేట?

- గుట్టుచప్పుడు కాకుండా అటవీ ప్రాంతంలో తవ్వకాలు
- పురాతన ఆలయాలు నిర్మాణాలే లక్ష్యంగా విధ్వంసాలు
- అటవీ అధికారులది ప్రేక్షక పాత్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లమల అటవీ ప్రాంతంలో గుప్తనిధుల వేట గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతోంది. భారీ నిర్మాణాలు, పురాతన కట్టడాలు, దేవాలయాలే లక్ష్యంగా తవ్వకాలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అటవీ అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. నల్లమల అటవీ ప్రాంతం అటవీ సంపదకే కాకుండా అపారమైన నిధి నిక్షేపాలకు క్షేత్రమని చెబుతూ ఉంటారు. నల్లమల అటవీ ప్రాంతంలో పురాతన కాలంలో ఉమామహేశ్వరం, సలేశ్వరం, లొద్ది మల్లెల తీర్థం వంటి దేవాలయాలు వెలిశాయి. కాకతీయుల కాలంలో నిర్మించిన ప్రతాపరుద్రుని కోట సైతం నల్లమలలోనే ఉంది. కాకతీయ రాజుల పరిపాలన కాలంలో ఈ ప్రాంతంలో అనేక శివాలయాలు, ఇతర ఆలయాలను నిర్మించినట్టు చారిత్రక ఆనవాలతో తెలుస్తోంది. ఈ ఆలయాలు నిర్మాణం చేపడుతున్న క్రమంలో పరిసర ప్రాంతాల్లో నిధులను ఉంచి కట్టడాలు చేపట్టారని కథలుగా చెప్పుకుంటారు. వీటిలో వాస్తవ అవాస్తవాలు ఎలా ఉన్నా.. విధ్వంసకారులు, మాఫియా తవ్వకాలకు పాల్పడుతున్నారు.

ఈ తవ్వకాల్లో చాలావరకు పురాతన విగ్రహాలు బయటపడుతున్నాయి. ఈ క్రమంలో ఆయా విగ్రహాలు ధ్వంసం కావడం, ఆలయ గోడలు, పునాదులు దెబ్బతిన్న ఘటనలు చోటుచేసుకున్నాయి.


కలకలం రేపుతున్న గుప్తనిధుల వేట

నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట, అమ్రాబాద్ మండలాల్లోని అడవుల్లో నిత్యం గుప్త నిధుల తవ్వకాలు జరుగుతుండటం కలకలం రేగుతుంది. ఇటీవల అమ్రాబాద్ మండలంలోని ప్రతాపరుద్రుని కోట సరిహద్దుల్లో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు. శ్రీశైలం ప్రధాన రహదారి పక్కనే ఉన్న ప్రతాపరెడ్డి కోట వద్ద ఐదుగురు వ్యక్తులు తవ్వకాలకు ప్రయత్నించారు. ఈ కోటకు వెళ్లే మార్గంలో అటవీశాఖ అధికారులు గేటును సైతం ఏర్పాటు చేశారు. అనుమతి లేనిదే ఈ మార్గం నుంచి లోనికి ప్రవేశించకూడదని నిబంధనలు విధించారు. అయినా పోలీసులు, అటవీశాఖ అధికారుల కళ్లుగప్పి రెండు బైకులపై వెళ్లి తవ్వకాలు జరిపేందుకు యత్నించారు సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు అమ్రాబాద్ మండలాలకు చెందిన రామచంద్రయ్యతో పాటు వంగరోనిపల్లికి చెందిన రామాంజనేయులు, దేవరకొండకు చెందిన చంద్రయ్య, భుత్పూర్‌కు చెందిన కృష్ణయ్య, మహబూబ్‌నగర్‌కు చెందిన చంద్రమౌళిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. అయితే చర్యలు తీసుకోవడం లేదని సమాచారం. శ్రీశైలం క్షేత్రానికి ఉత్తర ద్వారంగా ఉన్న ఉమామహేశ్వరం, మద్దిమడుగు, మల్లెలతీర్థం, లొద్ది మల్లయ్య, అస్సాపూర్, బౌరపురం వద్ద బ్రమరాంబ అమ్మవారి ఆలయాలు ప్రధానమైనవి. ఈ ఆలయంతో పాటు నల్లమలలోని చెన్నకేశవ స్వామి ఆలయంలోనూ గతంలో తవ్వకాలు జరిగినట్టుగా తెలుస్తోంది.

తవ్వకాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

అధికారులు అందించిన లెక్కల ప్రకారం.. 2018 ఆగస్టు 10న రాయల గండి వద్ద ఆలయ సమీపంలో గుప్త నిధుల కోసం అన్వేషిస్తున్న పలువురిని స్థానికులు పట్టుకున్నారు. 2019 నవంబర్ 20న పదర మండలంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ధ్వజస్తంభానికి ఎదురుగా ఉన్న అగ్నిగుండంలో తవ్వకాలు జరిపారు. 2020 ఫిబ్రవరి 11న అమ్రాబాద్ టైగర్ ఫారెస్ట్ రిజర్వ్ పరిధిలోని బౌరపురం భ్రమరాంబిక ఆలయంలో తవ్వకాలు జరిగాయి. 2021 అక్టోబర్లో లక్ష్మీ చెన్నకేశవుల ఆలయంలో తవ్వకాలు జరిపారు. ఇలా ప్రతి ఏడాదీ నల్లమల అటవీ ప్రాంతంలో తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. అలాగే గతేడాది అమ్రాబాద్ మండలంలోని రాయల గడిలో వెలసిన లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు చోటుచేసుకున్నాయి. అమ్రాబాద్, పదర ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఆలయ ప్రాంగణం భాగంలో ఉన్న పురాతన రాతి శిలను డ్రిల్లింగ్ చేసి శిల్పంలోని పద్మాన్ని ఎత్తుకెళ్లారు. రెండేళ్ల కిందట ఇదే ఆలయంలో తవ్వకాలకు ప్రయత్నించారు. పారిపోతున్న దుండగులను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నప్పటికీ పోలీసులు అటవీశాఖ అధికారులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయలేకపోయారని పలువురు ఆరోపిస్తున్నారు.

పురాతన కట్టడాలు కాపాడుకోవాలి

ఉమ్మడి మహబూబ్‌నగర్ నగర్ జిల్లాలో పురాతన కాలంలో వందలాది నిర్మాణాలన్నాయి. పాన్గల్ వనపర్తి, గద్వాల, కొల్లాపూర్, ఖిలాఘనపూర్ వంటి ప్రాంతాల్లో కోటల నిర్మాణాలున్నాయి. నేడు ఇవి పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. ముఖ్యంగా రాజులనాటి కాలంలో నిర్మించిన ప్రతాపరుద్రుని కోట ప్రాంతాన్ని టూరిజంగా మారుస్తామన్న పాలకులు.. ఇప్పుడు ఆ మాట ఎత్తడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం టూరిజం ఏర్పాటుకు కృషి చేయాలని పలువురు కోరారు.